# హస్తం ఆకర్ష్



హైదరాబాద్ వార్త

## గ్రేటర్‌లో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ ● మారుతున్న సమీకరణలు

### బలం పెంచుకునే దిశగా హస్తం అడుగులు ● బిఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు!



సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహాన్ దంపతులు, చిత్రంలో కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

లోక్‌సభ ఎన్నికలకు ముందు నగరంలో రాజకీయాలు ఊపందుకున్నాయి. ఇన్నాళ్లు పార్టీ చేరికలపై మౌనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ..ఆ పార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బిఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు హస్తం గూటికి చేరుతున్నారు. మొన్నటి వరకు బిఆర్ఎస్‌లో కీలక నేతలుగా చెలామణి అయిన వారు ఇప్పుడు కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు నేతలు బిఆర్ఎస్ పార్టీని వీడి.. కాంగ్రెస్‌లో చేరగా.. ఇప్పుడు మరి కొందరు నేతలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: కాంగ్రెస్‌లో కీలక నేతల చేరికలతో రాజకీయ పరిణామాల ఏ విధంగా మారబోతున్నాయనే అంశం నేడు ఆసక్తికరంగా మారింది. దీంతో గ్రేటర్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో జిహెచ్‌ఎంసి పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదు. అయినా ప్రభుత్వంలో ఉంది కాబట్టి వెళ్లేందుకు ఉత్సాహం చూపుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నాటికి గ్రేటర్‌లో పార్టీ బలోపేతం లక్ష్యంగా కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర తీస్తోంది. ఈ క్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లను చేర్చుకోవడంపై దృష్టి సారించింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన కాంగ్రెస్ పార్టీకి జిహెచ్‌ఎంసి పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటి కూడా దక్కని విషయం తెలిసిందే. ఇప్పటికే 14-18 మంది బిఆర్ఎస్ కార్పొరేటర్లతో పార్టీ నేతలు సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికే మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు హస్తం గూటికి చేరారు. సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కాగా, బొంతు రామ్మోహన్‌కు కాంగ్రెస్ ఏ విధమైన హామీ ఇచ్చిందనే అంశం కూడా ఆసక్తికరంగా మారింది. ఆయన వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ లేదా మల్కాజ్‌గిరి లోక్‌సభ సీటు ఆశిస్తున్నట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఎంపి సీటుపై ఏ విధమైన హామీ ఇచ్చిందన్నది ఆసక్తికరంగా మారింది.

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, మోతె శోభన్‌రెడ్డి దంపతులు నాలుగు రోజుల క్రితం సిఎం రేవంత్‌రెడ్డిని కలవడం హాట్‌టాపిక్‌గా మారింది. వారి వెంట మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ ఉన్నారు. దీంతో వారు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైందని తెలుస్తోంది. కాగా డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి వారం రోజుల క్రితం జరిగిన బిఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశానికి హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో త్వరలో భారీ ఎత్తున కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారని సమాచారం. ప్రస్తుతం మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డిను కలిశారు. పాలనా పరమైన అంశాల కోసమేనని ఆమె చెప్పినప్పటికీ తాజా పరిణామాల నేపథ్యంలో మేయర్ అడుగులు ఎటువైపు అన్న చర్చ నగరంలో జరుగుతోంది. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇతర పార్టీల నుంచి ఆకర్షించి ఎంపి స్థానాలను దక్కించుకోవాలని అనుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలు తమ కార్పొరేటర్లు పక్క చూపు చూడకుండా బుజ్జగిస్తున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ మూడు పార్లమెంటు నియోజకవర్గాలు ఉండడంతో వాటిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు పన్నుతుండగా, బిఆర్ఎస్, బిజెపి నేతలు వారి నాయకులను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు.





మింట్‌కాంపౌండ్ టిఎస్ఎస్‌పిడిసిఎల్ ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఇంజనీర్లు

## విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, సంయుక్త కిసాన్‌మోర్చా ,సెంటల్ ట్రేడ్ యూనియన్ తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళనలకు మద్దతుగా నేషనల్ కోర్డినేషన్ కమిటీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఇంజనీర్స్ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మింట్‌కాంపౌండ్‌లోని టిఎస్ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు రత్నాకర్‌రావు, సదానందం, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2021-22లో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు బిల్లు ప్రవేశపెట్టాలని ప్రయత్నించినప్పుడు దేశవ్యాప్తంగా 25లక్షల మంది ఉద్యోగులు ఏకమై అడ్డుకుని పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 11రాష్ట్రాల్లో విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును వ్యతిరేకించినట్లు తెలిపారు. కావున మళ్ళీ విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, తులసీనాగరాణి, కరుణాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రావు, వెంకట నారాయణరెడ్డి, జ్యోతిరాణి, నాగరాజు, జనప్రియ తదితరులు పాల్గొన్నారు.

### కోర్టు స్టేతో తాత్కాలికంగా నిలిచిపోయిన

## బండ్లగూడ అవిశ్వాస తీర్మానం

### న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం

అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన 16మంది కార్పొరేటర్లు



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను కార్పోరేటర్లకు చదివి వినిపిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

నార్సింగి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త : హైకోర్టు స్టేతో శుక్రవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో జరుగాల్సిన "అవిశ్వాసం" ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అవిశ్వాసంలో మేయర్ వర్గం గెలుస్తుందా? కార్పోరేటర్ల వర్గం గెలుస్తుందా? అన్న ఉత్కంఠపై కోర్టు ఇచ్చిన స్టే నీళ్లు చల్లినట్లయ్యింది. 34.రోజుల తరువాత క్యాంపును వీడి కార్పోరేషన్‌కు వచ్చిన కార్పోరేటర్లకు కోర్టు తీర్పు ఉసూరుమనిపించింది. న్యాయాన్ని బతికించాల్సిన అధికారగణమే అన్యాయం వైపు నిలిచి, చట్టంలోని లొసుగులను ఆసరాగా తీసుకొని మాకు తీరని అన్యాయం చేశారని కార్పోరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటిదేదో జరుగుతుందని ముందే పసిగట్టిన కార్పోరేటర్ల వర్గం జనవరి 29.వ,తేదీన నేరుగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకను కలిసి సకాలంలో అవిశ్వాసంను పెట్టాలని కోరుతూ వినతిపత్రంను అందజేశారు. అయినా 34.రోజుల తరువాత అంటే 16.ఫిబ్రవరి శుక్రవారం నాడు అవిశ్వాసంను పెడుతున్నట్లు అధికారులు ప్రకటించడం మమ్ములను తప్పుదోవ పట్టించడంలో భాగమేనని కార్పోరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ మాకు న్యాయం కావాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అవిశ్వాసం పెట్టుంటే మేమే గెలిచే వాళ్లమని, నేరుగా మమ్ములను ఎదుర్కొనే దమ్ములేక దొడ్డి దారిలో కోర్టుకెళ్లి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారన్నారు. ఇప్పుడు కూడా నైతిక విజయం మాదేనని పేర్కొంటూ కార్పోరేషన్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున బాణాసంచాను పేల్చారు. మొత్తంమీద మేయర్ మహేందర్‌గౌడ్ తన గాడ్‌ఫాదర్‌ను నమ్ముకొని, కోర్టుకెళ్లి తన వైరి వర్గంపై తాత్కాలికంగా పైచేయి సాధించారు. మేయర్ వర్గం మాత్రం "ధర్మం గెలిచింది" అంటూ వాట్సాప్ గ్రూపులలో మెసేజ్‌లు పెట్టి సంబరపడుతున్నారు.

**మేమూ న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం : కార్పోరేటర్లు**

రంగారెడ్డి జిల్లా అధికారులు, బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ కావాలనే కాలయాపన చేసి మాకు అన్యాయం చేశారని 16.మంది కార్పోరేటర్లు ఆరోపించారు. 30.రోజులలో నిర్వహించాల్సిన అవిశ్వాసం ప్రక్రియను 34రోజుల తరువాత పెట్టడం, ఆ తరువాత మేయర్ వర్గం కోర్టుకు వెళ్లేలా గైడ్ చేయడం వెనుకాల అధికారగణం హస్తం ఉందన్నారు. కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను మేము తప్పు పట్టడం లేదని, అధికారుల వ్యవహారా శైలినే తప్పు పడుతున్నామన్నారు. కోర్టు తీర్పును గౌరవిస్తున్నామని, ఈ.నెల 22వ తేదీ లోపు మేము న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తామని, కోర్టులో న్యాయం జరుగుతుందని సంపూర్ణ విశ్వాసం మాకుందని పేర్కొన్నారు. మా కార్పోరేషన్‌లో 21.మందికి గాను 16.మందిమి ఏకమై అవిశ్వాసం పెట్టామని, మావైపు స్పష్టమైన మెజారిటీ ఉందని, మేయర్ వైపు కేవలం 4.కార్పోరేటర్లు మాత్రమే ఉన్నారని వివరించారు.

**కోర్టు తీర్పును అందరం గౌరవించాల్సిందే : ఆర్డీఓ**

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో జరుగాల్సిన మిగతా సిటీ 3వ పేజీలో

## వేధింపులకు యువతి బలవన్మరణం

### భర్త, అత్త, మామ, ఆడపడచుల అరెస్టు



ఆత్మహత్యకు పాల్పడిన దేగల సంధ్యారాణి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త : వరకట్న వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడ్డ యువతి మరణ వాంగ్మూలంతో అత్త, ఆడపడచు, భర్తలను జీడిమెట్ల పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. గాజులరామారంకు చెందిన అభిలాష్ సంధ్యారాణి(28)లకి 1999 నవంబరు 28న వివాహమైంది. ఆరుంధతి పుట్టింటివారు 55తులాల బంగారం, రెండు కిలోలవెండితో పాటు సుమారు 10లక్షల రూపాయల అదనపు లాంఛనాలతో వివాహం జరిపించారు. అయినా తనను అత్త, భర్త, ఆడపడచు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పేర్కొంటూ మరణవాగ్మూళంగా లేఖరాసి ఈనెల గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. దీనిని ఆధారంగా చేసుకుని వేధింపులకు గురిచేసిన భర్త దేగల సంతోశ్‌బాబు, ఆడపడచు కవిత, అత్త పుష్పమ్మ, మామ మధుసూధన్‌లను శుక్రవారం జీడిమెట్ల పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా టిటిడి రథోత్సవం



హిమాయత్‌నగర్‌లో కొనసాగిన రథోత్సవం

సైఫాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: రథసప్తమి మహోత్సవం శుక్రవారం హిమాయత్‌నగర్‌లో కన్నుల పండవగా వైభవంగా ఘనంగా జరిగింది. లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి రథసప్తమి కార్యక్రమం ప్రారంభమైంది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని రథంపైన పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపులో భాగంగా రథాన్ని లాగడం కోసం వందలాది మంది భక్తులు పోటిపడ్డారు. రథం పురవీధుల్లో తిరుగుతున్నంత సేపు భక్తుల గోవింద నామాలు మారుమ్రోగాయి. గోవిందా, గోవిందా అంటూ పెద్ద ఎత్తున భక్తులు నినాదాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది. టిటిడి డిప్యూటి ఎఇవో రమేష్‌బాబు, ఎల్ఎసి అధ్యక్షుడు, పాల్గొన్నారు.

### బీసీ కులగణన తీర్మానం అసెంబ్లీలో

## ఆమోదం పొందటం హర్షనీయం

తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నేతలు



సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త: బీసీ కుల గణన సమగ్ర తీర్మానం శాసనసభలో ప్రవేశపెట్టటం, దానిని అఖిల పక్షం పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదం తెలపటం హర్షనీయమని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నేతలు అన్నారు. శుక్రవారం వారు శాసన సభలో బీసీ కుల గణన సమగ్ర తీర్మానం ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బిల్లు కోసం బీసీ సంఘాలు, మిగతా సిటీ 3వ పేజీలో

## నాలా పూడికతీత పనుల్ని చేపట్టాలి

### జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్



జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, ఎస్ఇ చిన్నారెడ్డి, డీఇ ఆనంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలా పూడికతీత పనుల్ని చేపట్టాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మూసాపేటలోని మైసమ్మచెరువుతోపాటు కామునిచెరువు, ముళ్ళకత్వ చెరువు ప్రాంతాలను జెడ్సీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్బంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే ముంపునకు గురయ్యే చెరువులతోపాటు నాలాను గుర్తించడం జరిగిందన్నారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారాలతోపాటు అడ్డంకులను తొలగించి వరదనీరు సాపీగా పోయేందుకు దృష్టిసారించాలన్నారు. వర్షాకాలం వచ్చే లోపు ఈపనుల్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితుల దృష్ట్యా పునరావస స్థలాలను గుర్తించాలని కోరారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం వరద ముంపు ప్రాంతాలలో నీరు నిలిచే ప్రాంతాల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా నాలా నిర్మాణ పనులను పూర్తిచేసి వర్షాకాలంలో వరదనీరు సాపీగా పోయేందుకు చర్యలు తీసుకుని ముంపు కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రమాదరకంగా మారిన నాలాల వెంబడి మెష్ పెన్సింగ్‌ను వేయాలన్నారు. నాలా పూడికతీత పనుల్ని సక్రమంగా నిర్వహించి వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకరంగా మారిన నాలాల వద్దకు తమ పిల్లలు వెళ్ళకుండా తల్లితండ్రులు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. జెడ్సీ అభిలాష అభినవ్ వెంట కూకట్‌ఫల్లి జోన్ ఎస్ఇ చిన్నారెడ్డి, డీఇ ఆనంద్‌తోపాటు జోనల్, సర్కిళ్ళ అధికారులు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి





నారాయణగూడ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న ఆటో, రవాణా రంగ కార్మికులు

సైఫాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: భారతీయ న్యాయ సంహిత 2023లోని హిట్ అండ్ రన్ చట్టంలోని 106 (1) అండ్ (2) నిబంధనలను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాని డిమాండ్ చేస్తూ రవాణా రంగ కార్మికులు శుక్రవారం నారాయణగూడ చౌరస్తాలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కేంద్రంలోని రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా నేడు చేపట్టిన పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలన్న పిలుపు మేరకు తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ జెఏసి ఆధ్వర్యంలో వేలాది మంది రవాణా కార్మికులు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి నారాయణగూడ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా కార్మికులు ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ నిరుద్యోగం పెరుగుదల, పెట్రోల్, గ్యాస్, డిజిల్, నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపు అయినప్పటికి ఇవే వి పట్టించుకోకుండా మోదీ ప్రభుత్వం పేదల జీవనో పాధిని దెబ్బతీస్తున్నదని ఆరోపించారు. కే ంద్రం తీసుకు వచ్చిన నూతన మోటారు వాహనాల చట్టాన్ని సవరిం చాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్ర మంలో జెఏసి నాయకులు మారయ్య, అజయ్, ప్రవీణ్, షేక్‌సలావుద్దీన్, తిరుమలేష్, ఎ.బిక్షపతియాదవ్, ఓమర్‌ఖాన్, ఎస్.కె.లతీఫ్‌ఖాన్, అశోక్, సి.హెచ్.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఐదున్నర ఏళ్ళుగా ఇన్‌చార్జీ టిపివోలే..

## అక్రమ నిర్మాణాలను నిలువరించేవారేరి?

### అడ్డు అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు

**దుండిగల్ మున్సిపాలిటీలో ఐదున్నర ఏళ్ళుగా ఇన్‌చార్జీ టిపివోలతో ప్రజల అవస్థలు**

**అందుబాటులో ఉండరూ.. స్పందించరూ..**

పూర్తిస్థాయి టిపివో లేకపోవడం.. ఇన్‌చార్జీలు పట్టనట్టు వ్యవహారించడంతో దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. పాతకాలం నాటి పంచాయతీ అనుమతులతో.. కమర్షియల్, కన్జర్వేషన్ జోన్లలో రెసిడెన్షియల్.. అసలు అనుమతులే లేకుండా ఇండిపెండెంట్ ఇండ్ల నుండి ఐదు, ఆరు అంతస్థుల వరకు బహుళ అంతస్థులు, భారీ షెడ్లు నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. అక్రమాలు వెలుగులోకి వచ్చిన, ఫిర్యాదులు ఉన్న పట్టణ ప్రణాళిక విభాగం నుండి ఏలాంటి స్పందన ఉండదు. దీంతో అక్రమ నిర్మాణదారులు జోరుగా నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయం కొల్లగొడుతున్నారు.



తాళం వేసి ఉన్న టిపివో గది

దుండిగల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త : పురపాలిక అయినా, నగరపాలిక అయినా అభివృద్ధిలో కీలకమైనది పట్టణ ప్రణాళిక విభాగం. అటువంటి విభాగం ఐదున్నర ఏళ్ళ క్రితం ఆవిర్భామైన పురపాలికలో నేటికి ఇన్‌చార్జీల తోనే కొనసాగుతుంది. వివిధ మున్సిపాలిటీలలో విధులు నిర్వర్తిస్తున్న టిపివోలకు ఇక్కడ ఇన్‌చార్జిలుగా బాధ్యతలు చేపట్టి మొదట్లో వారంలో ఒకటి, రెండురోజులు కార్యాలయానికి వచ్చినా కొంతకాలం తరువాత అది మానేశారు. వారు ఉన్నచోటకే ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో ఫైల్స్ తెప్పించుకొని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆ విభాగం పూర్తి గాడితప్పి అక్రమ నిర్మాణదారులకు స్వర్గధామమైంది. మున్సిపాలిటీలో కమీషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులను ఈవిషయమై ఎవరైనా అడిగితే పట్టణప్రణాళిక విభాగం పరిస్థితి తెలుసుకదా, మేము ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నాము అయినా పూర్తిస్థాయి టిపివోను నియమించడం లేదని దాటివేస్తున్నారు. నగరశివారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాగిల్లాపూర్, దుండిగల్, దొమ్మరపోచంపల్లి, బహాదూర్‌పల్లి, భౌరంపేట, మల్లంపేట పంచాయతీలను కలిపి దుండిగల్ మున్సిపాలిటీగా 2ఆగస్టు2018న ఆవిర్భవించింది. మున్సిపాలిటీకి ఇన్‌చార్జి కమీషనర్‌గా అప్పటివరకు అక్కడే ఇవోఅండ్‌పిఆర్‌డి పనిచేస్తున్న ఎ.జ్యోతిరెడ్డిని నియమించింది. మిగతా సిటీ 3వ పేజీలో



బిఆర్ఆర్‌బవార్చి పక్కన గల్లీలో కొనసాగుతున్న అనుమతుల్లేని బహుళ అంతస్థుల నిర్మాణం




కాంగ్రెస్‌లో చేరిన మీర్‌పేట్ కార్పొరేటర్లు

### కారు దిగి హస్తం గూటికి

## మీర్‌పేట్ కార్పొరేటర్లు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఇద్దరు బిఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక 28వ డివిజన్ కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, 30వ డివిజన్ కార్పొరేటర్ పిడుగు ప్రమీల యాదగిరి ముదిరాజ్‌లు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఆడ పడుచులకు తగిన ప్రాధాన్యత, గుర్తింపునిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి, అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్, వేముల నర్సింహా, గజ్జెల రాంచందర్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, నాయకులు సామిడి గోపాల్‌రెడ్డి, పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, సిద్దాల బాలప్ప, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల ఆగమయ్య, సిద్దాల శ్రీశైలం, సప్పిడి జంగారెడ్డి, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, మహిళా నాయకురాళ్లు అరుణ, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి గీతారెడ్డి, మాజీ డిజిపి హెచ్‌జె. దొర, మల్లేశ్వర్ రావ్

## సంత్ రవిదాస్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కె.పుష్పలీల

సైఫాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: మాదిగల ఆరాధ్యదైవమైన సంత్ జగద్గురు సంత్ రవిదాస్ 647 జయంతి ఈ నెల 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారపూర్వకంగా నిర్వహించాలని అఖల భారతీయ రవిదాసియ ధర్మ సంఘటన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘటన జాతీయ గౌరవ అధ్యక్షురాలు, మాజీ మంత్రి కె.పుష్పలీల, రాష్ట్ర ప్రతినిధి ఆరెపోగు ప్రమోద్, బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు ఎన్.రాధాకృష్ణ తదితరులు మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో మాదిగ చమార్ చెప్పులు కుట్టె కులంలో జన్మించిన ఆధ్యాత్మిక మార్గంలో ఎంతో మందిని ప్రభావితం చేసిన గొప్ప మహనీయుడు రవిదాస్ అని కొనియాడారు. ఆయన దృష్టిలో అందరూ సమానులేనని చాటి చెప్పారని, ఆయన బోధనలు మానవ జాతిని ఎంతో ప్రభావితం చేస్తాయని, అలాంటి మహానుభావుడి జయంతిని ప్రభుత్వం అధికారపూర్వకంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘటన్ ప్రతినిధులు కొమ్ము ప్రవీణ్‌కుమార్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల బాండ్ల జారీని నిలిపివేయడం

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ముషీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త: ఎన్నికల బాండ్ల జారీని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇవ్వటం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన చేస్తూ ఎన్నికలలో నల్ల ధనాన్ని అరికట్టి, రాజకీయ పార్టీల విరాళాల విషయంలో పారదర్శకంత తీసుకురావాలనే ఉద్దేశ్యంతో 2018లో కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రోల్ బాండ్ల పథకాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. అయితే రాజకీయ పార్టీలు తాము స్వీకరించిన విరాళాలను, వాటిని ఇచ్చిన దాతల వివరాలను బహిర్గతం చేయవలసిన అవసరం లేదని ఆర్టికల్ 2017 ద్వారా పలు సవరణలు చేసిందన్నారు. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని, విరాళాలు ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచటం సమాచార హక్కును కాలరాయడమేనని, క్విడ్ ప్రోకోకు దారి తీస్తుందని, ఎన్నికల బాండ్ల జారీని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెంటనే నిలిపివేయాలని ఆదేశించటం అభినందనీయమని అన్నారు.

## వ్యాధుల వ్యాక్సిన్‌పై విద్యార్థులకు అవగాహన

సైఫాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: మహమ్మారి వ్యాధుల వ్యాక్సిన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రక్రియ గురించి తెలియజేస్తూ పలు కళాశాలలో సదస్సులు నిర్వహిస్తున్నామని భారత్ బయోటెక్ క్వాలిటి కంట్రోల్ హెడ్ డా.బృందా గన్నేరు చెప్పారు. కోవిడ్ మహమ్మారి దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మానవాళికి చేసిన నష్టం అందరికి తెలిసిందేనని, అయితే ఈ మహమ్మారిని నివారించడంలో కోవాక్సిన్ ద్వారా భారత్ బయోటెక్ సిద్ధంగా ఉందని ఇందుకోసం విద్యార్థులను వారియర్స్‌గా తయారుచేస్తున్నామని తెలిపారు. 'ఉమెన్ లిఫ్ట్ హెల్త్ లీడర్షిప్ ప్రోగ్రామ్' ద్వారా అంతర్జాతీయంగా భారత్ బయో టెక్ భాగస్వామ్యమైందని బృందా వివరించారు. భారత్ బయోటెక్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్, నిజాం కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిజాం కళాశాలలో వ్యాక్సిన్ డెవలప్‌మెంట్ అండ్ మ్యాన్ ఫ్యాక్చరింగ్: క్వాలిటి అట్రిబ్యూట్స్' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బీమా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా.బృందా మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఇప్పటికే నాలుగు కళాశాలలో వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సదస్సులో నిజాం కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా.డి.సాంబశివరావు సమన్వయ కర్తగా వ్యవహరించారు.

## ఆటో డ్రైవర్లను కాపాడండి



ఆర్కే ట్రాన్స్‌ఫోర్ట్ యజమాని నాదేళ్ల చంద్రమౌళికి వినతిపత్రం అందజేస్తున్న ఆటో యజమానులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త : సూరారంలో ఆర్కే ట్రాన్స్‌ఫోర్ట్ యజమాని నాదేళ్ల చంద్రమౌళి స్థానికంగా బొంతపల్లి, కాజిపల్లి, బొల్లారం పరిశ్రమలకు 30 నుంచి 40 బస్సులలో ఉద్యోగస్తులను ప్రతిరోజు మూడు షిఫ్టులు వివిధ కంపెనీలకు చేరవేస్తాడు. తిరిగి వచ్చేటప్పుడు డ్రైవర్లు దుండిగల్ నుండి అమీర్‌పేట్ వరకు ప్రయాణికులను తక్కువ డబ్బులు తీసుకుని రవాణా చేయుచున్నారు. అందుకు స్థానికంగా ఉండే తెలంగాణ ఆటో యజమానులు ప్రయాణికుల రాకపోవడం ఉపాధి కోల్పోయి తీవ్ర నష్టాలు ఎదుర్కుంటున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత రవాణా వల్ల మాకు చాలా నష్టం జరుగుతుందని, అందుకు ఆర్కే ట్రాన్స్‌ఫోర్ట్ వారు ఆయా డ్రైవర్లకు ప్రయాణికులను తీసుకోకుండా హెచ్చరికలు జారి మా యొక్క ఉపాధిని కాపాడాలని యజమాని కోల రవీందర్ ముదిరాజ్‌ను సామాజిక కార్యకర్త ఆధ్వర్యంలో వినతిప త్రం అందజేశారు. అందుకులకు చంద్రమౌళి స్పందిస్తూ అట్టి డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఇందులో సుమారు 60మంది ఆటో యజమానులు పాల్గొన్నారు.

## ఘనంగా అగ్ని సోలార్ 11వ వార్షికోత్సవం



అడ్డగుట్ట, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా ఉన అగ్ని సోలార్ 11వ వార్షికోత్సవ వేడుకలు సికింద్రాబాద్‌లోని ఒక హోటల్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న డిజిఎంఎస్ రిటైర్డ్ డైరెక్టర్ జి.ప్రసాదరావు, గౌరవ అతిధులుగా రీ ఎనర్జీ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ ఎవీఎల్ రావు, బివి రాజు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ప్రొఫెసర్ ఎన్.రాంచందర్ తదితరులు పాల్గొని అగ్ని సోలార్ నిర్వ హకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంతో ఉత్సాహంగా సాగిన సోలార్ వార్షికోత్సవ వేడుకల్లో అగ్ని సోలార్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నేశ్వర్‌రావు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా తమ ప్రయాణంలో సహకరించిన ఉద్యోగులు, భాగస్వాములు, వాటాదారులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంస్థను విజయపథంలో నడిపించడంలో ప్రతి ఒక్కరూ పోషించే పాత్ర కీలకమైనదని ఎక్స్‌లెన్స్, ఇన్నోవేషన్, సస్టెయినబిలిటిల పట్ల అగ్ని సోలార్ నిబద్ధతను ఆయన వివరించారు. ఈ సందర్భంగా అగ్ని సోలార్ మేనేజ్‌మెంట్ తమ విజన్ 2029 ప్రణాళికను ఆవిష్కరిస్తూ అందులో భాగంగా 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి 1000 కోట్ల ఆదాయ మైలురాయిని సాధించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని కూడా ప్రకటించారు. రాబోయే ఐదేళ్ళలో స్థిరమైన వృద్ధి పట్ల అగ్ని సోలార్ నిబద్ధతను నిర్వహకులు తెలిపారు. పునరుత్పాదక శక్తితో నడిచే ప్రకాశవంతమైన, శక్తివంతమైన, స్వచ్ఛమైన భవిష్యత్తును రూపొందించడంలో సంస్థ అచంచలమైన అంకితభావాన్ని పురుద్ఘాటించారు.

## భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి



ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో విద్యార్థి ప్రదర్శన-నిరసన సభ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16ప్రభాతవార్త: నూతన విద్యావిధానం రద్దు చేయాలని, భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని, ఢిల్లీలో సరిహద్దుల్లో రైతులపై కాల్పులు చేసి నిర్బంధాలు ప్రయోగించడం దుర్మార్గమని పేర్కొంటూ గ్రామీణ భారతబంద్‌కు మద్దతుగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, నిరసన సభ శుక్రవారం జరిగింది. వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యు, ఏఐడిఎస్ఓ, ఎఐఎస్‌బి, పిడిఎస్‌యు(వి) ఆధ్వర్యంలో నారాయణగూడ నుంచి ఆర్టీసిక్రాస్‌రోడ్స్ వరకు విద్యార్థులు భారీ ప్రదర్శన జరిగింది. క్రాస్‌రోడ్స్‌లో నిరసన సభ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు టి.నాగరాజు, ఆర్ఎల్.మూర్తి (ఎస్ఎఫ్ఐ), పుట్టాలక్ష్మణ్(ఎఐఎస్ఎఫ్), మహేష్(పిడిఎస్‌యు), రామకృష్ణ(పీడీఎస్ఎస్‌యు), మల్లేష్(ఎఐఎస్‌డిఓ), హాకీం నవీద్(ఎఐఎస్‌బి), ఎ.విజయ(పిడిఎస్‌యు, విజృంభణ) మాట్లాడారు. దేశంలో విద్యారంగానికి తక్కువ నిధులు ఇచ్చిన నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలను నష్టంచేసే చర్యలు చేస్తుందని అన్నారు.



చింతల నాగరాజు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

## జాతీయ కార్మిక సమ్మె

జీడిమెట్ల, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త : జాతీయ కార్మిక సమ్మె సందర్భంగా శుక్రవారం రాష్ట్ర కార్మిక నాయకుడు చింతల నాగరాజు ఆధ్వర్యంలో ఐడిపిఎల్ చౌరస్తా నుండి భారీ బైక్ ర్యాలీని కుత్బుల్లాపూర్ చౌరస్తా వరకు, జీడిమెట్ల పారిశ్రామిక వాడ నుంచి జీడిమెట్ల డిపో అంబేద్కర్ విగ్రహం వరకు భారీగా బైక్ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మోడీ నల్ల చట్టాలను తిప్పికొడుదాం అని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక ప్రజా వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి కార్మికులు సాధించుకున్న హక్కులను కార్పోరేట్ సంస్థలకు తాకట్టుపెట్టి కార్మికుల పొట్ట కొట్టడానికి చూస్తున్న మోడీకి కార్మికవర్గం రాబోయే 24 జనరల్ ఎలక్షన్‌లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్, నడిమింటి నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి యాదగిరి బాలరాజ్‌గౌడ్, మురళి భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, వాసు, శ్రీనివాస్, శ్రీను రవి, దేవేందర్, ఆనంద్‌లు పాల్గొన్నారు.

### ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహిచిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐఎన్‌టియుసి కార్యదర్శి అదిల్‌షరీఫ్

బేగంబజార్,ఫిబ్రవరి 16ప్రభాతవార్త: ఆల్ ఇండియా స్టేట్ గవర్నర్‌మెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ,కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయాప్రాంతాలల్లో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని ఖండించారు. ఇండియన్ మున్సిపల్,స్థానిక ఫెడరేషన్, తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి అదిల్‌షరీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఈ నిరసన కార్యక్రమంలో హెచ్ఎంఎస్, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల నాయకులు ఆర్.డి చంద్రశేఖర్, విజయ్‌కుమార్‌యాదవ్, నాగన్నగౌడ్ వందలాదిమంది కార్మికులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటా : ఎమ్మెల్యే తలసాని



మెరుగైన వైద్యానికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని


కంటోన్మెంట్,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: మోకాలి శస్త్రచికిత్స కోసం ఇబ్బంది పడుతున్న పేద మహిళకు అండగా ఉంటామని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. రాంగోపాల్‌పేట్ గైదన్ బాగ్‌కు చెందిన నఫీజ్ బేగం మోకాలి నొప్పితో బాధపడుతుంది. మెరుగైన వైద్యం కోసం మంజూరైన రూ.90 వేల ఎల్‌ఓసీ పత్రాన్ని శుక్రవారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ అరుణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే లాస్యను పరామర్శించిన 2వ వార్డు బిఆర్ఎస్ నేతలు



కంటోన్మెంట్ లాస్యను పరామర్శించిన 2వ వార్డు బిఆర్ఎస్ నేతలు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: నల్లగొండలో ఈ నెల 13న బిఆర్ఎస్ తలపెట్టిన బహిరంగ సభకు హాజరై తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితను శుక్రవారం 2వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నాయకులు రఘురామ్, నరేశ్, అంజనేయులు, నయీం, జిలాని, బాల్‌రాజ్, యాదగిరిలు కలిసి ఎమ్మెల్యే లాస్యను పరామర్శించారు.



ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి గూడ అయిలయ్యగౌడ్ నాయకత్వంలో ర్యాలీగా ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

## ప్రోటాకాల్ పాటించని వారికి ప్రోటోకాల్ గురించి మాట్లాడే అర్హత లేదు

**అసెంబ్లీలో ఎమ్మెల్యే కాలేరు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది .. అంబర్‌పేట్ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు**



సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, దిడ్డిరాంబాబు, గరిగంటి రమేష్, పులిజగన్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త: ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రోటోకాల్ వంటి మాటలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అసెంబ్లీ సాక్షిగా మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అంబర్‌పేట్ నియోజకవర్గ మాజీ కార్పొరేటరున్ల ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కాలేరు గత ఐదేళ్లుగా శాసన సభ్యుడిగా ఉండి నియోజకర్గంలోని ఇతర ప్రజాప్రతినిధులపట్ల ప్రోటోకాల్ పాటించారా అని ప్రశ్నించారు. శుక్రవారం డిడికాలనీలోని మాజీ ఎంపి విహెచ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబాబు, పులిజగన్, టిపిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, కాంగ్రెష్ ఖైరతాబాద్ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్‌లు మాట్లాడారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అసెంబ్లీలో అంబర్‌పేట్‌లో ప్రోటోకాల్ పాటించడం లేదని కాంగ్రెష్ నుంచి పోటీ చేసిన రోహిణ్‌రెడ్డిపై అక్కసు వెల్లగక్కడం సబబు కాదని వారు హితవు పలికారు. అంబర్‌పేట్ నియోజకవర్గ అభివృద్ధికోసం రోహిణ్‌రెడ్డి సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో 20కోట్లు నిధులు మంజూరు చేయించారని దీనిని ఆహ్వానించాల్సిన ఎమ్మెల్యే ఎలా మంజూరు చేయిస్తారని ప్రశ్నించారన్నారు. నియోజకవర్గ నరపజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాల చొరవ తీసుకుంటుందని ఎమ్మెల్యేగా ఉన్న కాలేరు ఏనాడైనా స్థానిక పార్లమెంట్ సభ్యుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఏనాడైనా అభివృద్ధి కార్యక్రమానికి ఆహ్వానించారా అని ప్రశ్నించారు. ప్రోటాకాల్ పాటించని వారికి ప్రోటోకాల్ గురించి మాట్లాడే అర్హత లేదని తమ నేత రోహిణ్‌రెడ్డి చౌకబారు ఆరోపణలు చేస్తే సహించేదిలేదని వారు హెచ్చరించారు.

## నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపు కొనసాగుతుంది

కంటోన్మెంట్,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: బోయిన్‌పల్లి సెంటర్ పాయింట్ బాపూజీ నగర్ వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో కొనసాగుతున్న ఉజ్జయిని వైన్‌షాప్ ఎక్సైజ్, కంటోన్మెంట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతుందని సాయివైన్స్ నిర్వాహకుడు రాజు యాదవ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఓ ఖాళీ స్థలంలో చిన్న షెడ్డును ఏర్పాటు చేసుకొని వైన్‌షాప్‌ను నిర్వహించడం సరైందికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వైన్‌షాప్‌పై చర్యలు తీసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు.

**నిబంధనల మేరకే వైన్‌షాప్ కొనసాగుతుంది : కిరణ్ గౌడ్**

ఎక్సైజ్ శాఖ నియమ నిబంధనల మేరకే వైన్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని ఉజ్జయిని వైన్‌షాప్ నిర్వాహకులు కిరణ్ గౌడ్, నాగరాజులు తెలిపారు. సంవత్సరానికి కోటీ 20 లక్షల రూపాయలు ఎక్సైజ్ శాఖకు డబ్బులు చెల్లించి లైసెన్ తీసుకొని వైన్‌షాప్‌ను కొనసాగిస్తున్నామన్నారు.

## గాయకుడిగా, సేవలను అందిస్తున్న కె.ఈ.రాజు అభినందనీయులు



కెఈ.రాజును సత్కరిస్తున్న ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట్ గరికపాటి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: గాయకుడిగా, పారిశ్రామికవేత్తగా విశేషంగా సేవలను అందిస్తున్న కె.ఈ.రాజు అభినందనీయులు అని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట్ గరికపాటి అన్నారు. శుక్రవారం శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ, అల్లం ఛాయ్ గ్రూప్ సౌజన్యంతో రాగా ఆర్ట్స్ అండ్ కల్చరల్స్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కె.ఈ.రాజుకు అభినందన సభ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహకుడు 'శ్రీరామ' చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా వెంకట్ గరికపాటి హాజరై కెఈ.రాజును సత్కరించారు. వెంకట్ గరికపాటి మాట్లాడుతూ గాయకుడిగా రాజు మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని, సమాజసేవలో తరించాలన్నారు. కెఈ.రాజు మాట్లాడుతూ తన ఎదుగుదలకు కారణం నాలుగు 'ఎస్'లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నంది అవార్డుగ్రహీత, ప్రముఖ గాయనీ డి.సురేఖామూరినత, 'స్వరకిన్నెర', ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, వైఎస్.రామకృష్ణ, ఆర్క సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మస్తాన్ ఆలీ, డైరెక్టర్‌లు సంతోష్, శివ, సతీష్, ఎస్.కృష్ణ, రవికుమార్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో కులగణన తీర్మాణం హార్షణీయం


**బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య**



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, వెంకటేష్, కోలా జనార్ధన్, నందగోపాల్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త: కులగణన తీర్మానాన్ని, అసెంబ్లీలో పెట్టడం హార్షనీయమని సమగ్ర కులగణన చేసి అన్నిరంగాల్లో బిసిలకు రిజర్వేషన్ను పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు శుక్రవారం కాచిగూడలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణన విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా వెంటనే చేపట్టాలన్నారు. కులలవారిగా లెక్కలు తీసి అన్నిరంగాల్లో రిజర్వేషన్లు పెంచినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి బిసిగురుకులాలనికి సొంతభవనాలు నిర్మించాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలని, ప్రతినియోజకర్గానికి బిసి స్టడీ సర్కిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్కాలర్‌షిప్, ఫీజుల బకాయి చెల్లించాలని బకాయి లేకుండా గ్రీన్ ఛానల్ పెట్టాలని ముఖ్యమంత్రి ఒరేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే దేశవ్యాప్తంగా కులగణన జరిగే విధంగా అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా ఒక్కటై కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

## పాదయాత్రకు సంఘీభావం



సిరిసిల్లలో తలపెట్టిన పాదయాత్రలో బండి సంజయ్‌కు సంఘీభావం తెలుపుతున్న మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త : సిరిసిల్ల జిల్లాలో తలపెట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా బండి సంజయ్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి ప్రాంతంలో ప్రజలను నేరుగా కలవడం జరుగుతుందని మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ముందుగా శ్రీ దుర్గామల్లేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించి బండి సంజయ్ తలపెట్టిన పాదయాత్రలో సంఘీభావం తెలియజేశారు. ఈకార్యక్రమంలో సుదర్శన్ ముదిరాజ్, నార్లపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కార్మికులకు రూ.26.వేల జీతాలు ఇవ్వాలి : చంద్రమోహన్



నార్సింగిలో జరిగిన దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్మికులు

నార్సింగి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త : కార్మికులకు రూ.26.వేల జీతాలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు రుద్ర కుమార్‌లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నార్సింగిలో దేశవ్యాప్త కార్మిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వేతనంను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధారాణి, జ్యోతి, లత, అరుణ, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగు పనులను ప్రారంభించాలి



జోనల్ కమీషనర్ పంకజకు వినతి పత్రాన్ని అందజేస్తున్న స్టాండింగ్ కమీటి మెంబర్ శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: నాచారం డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన ప్రారంభించాలని కోరుతూ కార్పోరేటర్, స్టాండింగ్ కమీటి మెంబర్ శాంతి సాయిజన్ శేఖర్ ఎల్‌బీనగర్ జెడ్‌సీకి పంకజకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. నాచారంలో మంజూరైన రూ. 2 కోట్ల సీసీరోడ్డు పనులను నెలలు గడుస్తున్నా శంకుస్థాపన చేయడంలేదని, అంబేద్కర్ విగ్రహం వద్ద రూ. 94 కోట్లతో మంజూరైన కొత్త బిడ్జి నిర్మాణ పనులను ఎండాకాలం పూర్తి అయ్యేలోగా పూర్తి చేయాలని కోరారు. విఎస్‌టీ కాలనీ, కార్తికేయనగర్, భవాని నగర్ బస్తీలో రోడ్డు నిర్మాణం పనులకు నిధులను మంజూరు చేసినందుకు జోనల్ కమీషనర్ పంకజకు కార్పోరేటర్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

## 18న ఆస్ట్రేలియా అడ్మిషన్స్‌డే

**యూని ఎక్స్‌పర్ట్ ఓవర్సీస్ ఎడ్యూకేషన్**

హైదరాబాద్,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త: ఆస్ట్రేలియా దేశంలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థినీ విద్యార్థుల కోసం యూని ఎక్స్‌పర్ట్ ఓవర్సీస్ ఎడ్యూకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో ఆస్ట్రేలియా అడ్మిషన్స్‌డే నిర్వహిస్తున్నట్లు సంస్థ ఆపరేషన్ హెడ్ ఉమా తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో చదువుకోవాలంటే విద్యార్థులకు ఇదొక సువర్ణ అవకాశం అని అన్నారు. ఈఎడ్యూకేషన్ ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులు ,తల్లిదండ్రులు వీసా రిక్రూట్‌మెంట్, అడ్మిషన్ రిక్రూట్‌మెంట్ ,స్కాలర్షిప్ అప్షన్స్, లాంగర్ స్టేబ్యాక్ ఆప్షన్, ట్రావెల్ అప్డేట్ తదితర అంశాలపై నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



పర్వత్ నగర్ శ్రీ దుర్గామల్లేశ్వరి ఆలయం 22వ వార్షికోత్స వేడుకల్లో పాల్గొన్నకాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. పర్వత్‌నగర్‌లో శ్రీ దుర్గామల్లేశ్వరి అమ్మవారి ఆలయం 22వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక సంక్షేమ సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు జాహేద్ షరీఫ్, ఫనికుమార్, అనంతయ్య, బి.గోపి, రాజుయాదవ్, శ్రీహరి, సుదర్శన్‌రెడ్డి, కొండల్, శ్రీనివాస్ యాదవ్, రాజవర్ధన్‌రెడ్డి, కొమ్మిశెట్టి శ్రీనివాస్, టిప్పర్ వెంకటేష్, శ్రీధర్, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

## కులగణన చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల హర్షం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇంటింటికి వెళ్ళి కులగణన చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.పి.మురళీకృష్ణ చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనార్టిలను, ఇతర వర్గాలను కులగణన చేయడం ద్వారా ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో వారికి లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రంలో 85 శాతం ఉన్న బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. గత పది సంవత్సరాల నుంచి బిసిల అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఏ మాత్రం కృషి చేయలేదని, మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఏనాడు కులగణనపై ఊసే ఎత్తలేదని, ఆ ప్రభుత్వం చేసిన సర్వేను కూడా బయటపెట్టలేదని ఆరోపించారు.



బస్టాండ్ ఆవరణను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

## యాచారం బస్టాండ్‌ను పరిశీలించిన ఎంపిపి,ఎంపిడివో డిఎం

**యాచారం ఫిబ్రవరి16,ప్రభాతవార్త :** యాచారం బస్టాండ్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ తెలిపారు.శుక్రవారం యాచారం మండల కేంద్రంలోని బస్టాండ్‌ను ఎంపిపి కొప్పు సుకన్య భాష,ఎంపిడివో లతో కలిసి డిపో మేనేజర్ సందీప్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ...డిపోను వాడుకులకు తీసుకోచ్చిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు పోలీసులను అభినందించారు.సహకారంతోనే బస్టాండు వాడుకులకు వచ్చిందని అందుకు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎంపిపి మాట్లాడుతూ...తక్షణమే బస్టాండ్‌లో మౌలిక వసతుల కల్పన కృషి చేయాలని ప్రయాణికులు బస్టాండ్ వాడుకలోకి వచ్చినప్పుడు నుంచి ప్రాథమిక అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారని సౌకర్యం కోసం డిపో మేనేజర్ సహకరించాలని కోరారు.బస్టాండ్‌లో చాలా మంది ప్రయాణీకులు వర్షానికి,చలికి తట్టుకుంటూ మంచి పరిస్థితుల్లో ఉన్నారని మరింత అభివృద్ధి జరగాలని కోరుతున్నామన్నారు.

## కలెక్టర్ చొరవతో దివ్యాంగులకు సదరం సర్టిపికెట్స్



సదరం క్యాంపు దగ్గర దివ్యాంగుల దృశ్యం

**యాచారం ఫిబ్రవరి16,ప్రభాతవార్త :** యాచారం గ్రామీణ ప్రాంతాలలోని దివ్యాంగులకు కలెక్టర్ ప్రత్యేక చొరవతో మంచానికే పరిమితమైన దివ్యాంగులకు శుక్రవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్‌లను డాక్టర్ల చేత అసెస్మెంట్ చేయించారు.ఈ సందర్భంగా విహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ...గత సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు మంచానికే పరిమితమైన దివ్యాంగులకు సదరం సర్టిఫికేట్స్ అందజేయాలని ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు విన్నవించగా కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని డాక్టర్లతో మాట్లాడి వీరికి అసెస్మెంట్ చేయాలని అదేశించడంతో దివ్యాంగుల సర్టిఫికెట్స్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశంక ఐకెపి డిసిఎం సూర్య,ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదరం క్యాంపు ఎపిఎం జంగయ్య, విహెచ్‌పిఎస్ యాచారం మండల అధ్యక్షుడు మహ్మద్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేఖ చట్టాలను ఉపసంహరించుకోవాలి

**యాచారం ఫిబ్రవరి16,ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరిచుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం దేశవ్యాప్తంగా జరుగుతున్న భారత్‌బంద్‌లో భాగంగా యాచారం మండల కేంద్రంలో ప్రదర్శన జరిపి అంబేద్కర్ చౌరస్తా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి మాట్లాడుతూ....బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించిన 49 కార్మిక చట్టాలను 4 లేబర్ కార్డులుగా మార్చి కార్పొరేట్ శక్తులైన అంబాని,ఆధానిలకు అప్పజెప్పడం కోసం ప్రయత్నం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రజావ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్షుడు అంజయ్య,కెవిపిస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ్మ,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య,సీఐటియు మండల కన్వీనర్ చందు నాయక్,రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

### పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబికులు

**పరిగి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలిమృతి చెందిన సంఘటన పరిగిపోలీస్‌స్టేషన్ పరిధిలోని గడిసింగాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి.. గడిసింగాపూర్ గ్రామానికి చెందిన నరసమ్మ (65) తన ఇంట్లో ఒక్కతే నివసించేది అయితే శుక్రవారం ఉదయం అయినా తలుపుల తెరవకపోవడంతో ఇరుగు పొరుగు వారు గమనించి తలుపులు తెరిచి చూడగా ఆమె అప్పటికే చనిపోయి ఉంది. మృతురాలికి అక్కడక్కడ రక్తపు గాయాలు ఉండ డంతో మృతురాలు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుం బీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీలసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన సునీతారెడ్డితో మాజీ ఎంపిపి జ్యోతి శ్రీనివాస్ నాయక్



సునీతారెడ్డి సన్మానిస్తున్న మాజీ ఎంపిపి

**యాచారం ఫిబ్రవరి16,ప్రభాతవార్త :** బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరిన వికారాబాద్ జడ్పిచైర్‌పర్సన్ సునీత రెడ్డిని యాచారం మాజీ ఎంపిపి రామమూర్తి జ్యోతి శ్రీనివాస్ నాయక్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.గతంలో సునీతా రెడ్డితో జ్యోతి శ్రీనివాస్ నాయక్ కలిసి పనిచేసిన సందర్భంగా వారి సన్నితాన్ని గుర్తు చేస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో వెళ్లి వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి, కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి స్వగృహంలో శాలువా బోకేతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కురుమిద్ద సర్పంచ్ బందే రాజశేఖర్ రెడ్డి,నల్లవెల్లి మాజీ ఎంపిటిసి సందాని నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు శూన్యం...

- 80శాతం పూర్తయిందనడం పచ్చి అబద్ధాం
- అసెంబ్లీలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- గూడు, నీరు, విద్యా షాద్‌నగర్ ప్రజలకు అందేలా చూడాలి
- గత ప్రభుత్వ పాలనను ఎండగట్టిన ఎమ్మెల్యే



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ఫిబ్రవరి 16, (ప్రభాతవార్త) :** మొదటి నుంచి బీఆర్ఎస్ పార్టీ పాలమూరు ఎత్తిపోతల పథకం విషయంలో షాద్‌నగర్ ప్రాంత ప్రజలను మోసం చేస్తునే ఉందని, ఇప్పటి వరకు షాద్‌నగర్ ప్రాంతంలోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి ఎలాంటి పనులు జరగకపోయిన 80 శాతం పనులు పూర్తయినట్లే మాజీ ముఖ్యమంత్రి ప్రసంగాలు చేయడం అస్యాస్పదమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్ సమయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశ్నించే అవకాశం రావడంతో షాద్‌నగర్ నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, డబుల్‌బేడ్‌రూంలు, మీషన్ భగీరథ, విద్యావ్యవస్థకు సంబంధించి పనలు సమస్యలపై ఆయన అసెంబ్లీలో తన గళం వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలమూరు జిల్లా వలసల జిల్లా అని గత ప్రభుత్వం పదే పదే చెప్పి ఆ ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల పథకం విషయంలో మాజీ ముఖ్యమంత్రి 80 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పడం పచ్చి అబద్ధామని, ఐదు లిఫ్టులు, ఆరు రిజర్వాయర్లతో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను కూడా కడతామని చెప్పిన నాటి ముఖ్యమంత్రి ఆ పనిని చేపట్టకుండా మా ప్రాంత ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఇప్పటి వరకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు మొదలు కాలేదని, ఇక్కడి ప్రాంతం ఎత్తైనా ప్రదేశం కావడంతో తాగు, సాగు నీరు లేక షాద్‌నగర్ ప్రాంత ప్రజలు, రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా 72 జీవో ప్రకారం కాకుండా నీటిని అందించాలని ఆయన కోరారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధిచెందినా తమ ప్రాంతంలో మిషన్ భగీరథ ద్వారా ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కొన్ని మున్సిపల్ పరిధిలోని మీషన్ భగీరథ అందడం లేదని, పైపులైన్లు అస్తవ్యస్తంగా వేయడం జరిగిందని ఈ సమస్యలపై సంబంధిత అధికారులకు సూచలను సలహాలు అందించి నీరు సక్రమంగా అందేవిధంగా చూడాలని ఆయన కోరారు. విద్యాపరంగా సహితం గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కనీస మౌళిక వసతులు కల్పించలేకపోయిందని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు.

### ఆగమేఘాలపై ప్రారంభం... అంత శూన్యం...

షాద్‌నగర్ ప్రాంతంలో నిర్మించిన 1800 డబుల్ బేడ్ రూం ఇండ్లను గత ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభోత్సవాలు చేశాయని, కేవలం ఓట్ల లబ్ధి కోసమే నామమాత్రంగా ప్రారంభోత్సవం చేసి ఒక్కరికి కూడా ఇండ్లను మంజూరు చేయలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. నాసిరకంగా నిర్మించిన ఆ ఇండ్లు ఇప్పుడు పూర్తిగా పగుళ్ల ఏర్పాడ్డాయని, ఇండ్లు పూర్తిగా నిర్వీర్యం అవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు ఇవ్వాల్సిన ఇండ్లను గత ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని, దీనిపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఒక కమిటీ వేసి సామాజిక న్యాయంగా ఇండ్లను కేటాయించాలని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. పేద ప్రజలకు అందించాల్సిన ఈ ఇండ్లను నిజమైన అర్హులకు అందేలా చూడాలని ఆయన కోరారు. మొదటి సారి ఎన్నికైన తనకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అదేవిధంగా సభ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# డ్రా చేసిన డబ్బులు..కాజేశారు..

**నోట్లు లెక్కగట్టిస్తామని..నొక్కేసిన దుండగులు**

**పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత మహిళ**

**వికారాబాద్,ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** అత్యవసర నిమిత్తం ఓ మహిళ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి బ్యాంకులో డబ్బులు డ్రా చేశారు. అక్కడే కాపు కాచి ఉన్న దుండగులు అమాయకపు మహిళను పసిగట్టారు. బ్యాంకులో దొంగ నోట్లు వస్తున్నాయని కబుర్లు చెప్పి..నోట్లు లెక్కగట్టిస్తామని చెప్పి మహిళ వద్ద నుంచి డబ్బులు నొక్కేశారు దుండగులు. తాను మోసపోయానని తెలిసి బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ ఈ నెల 9వ తేదీన వికారాబాద్ పట్టణంలోని కెనెరా బ్యాంకులో అత్యవసరాల నిమిత్తం బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.93 వేలు తీసుకుంది. నగదు డ్రా చేసిన విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని దుండగులు చంద్రకళతో మాట మాట కలిపి, బ్యాంకులో దొంగ నోట్లు వస్తున్నాయని, వాటిని గుర్తించకపోతే నష్టపోతామని కబుర్లు చెప్పారు. అంతటితో ఆగకుండా చంద్రకళ చేతిలోంచి డబ్బులు తీసుకుని లెక్కించి తిరిగి చంద్రకళ చేతిలో డబ్బు ఉంచారు. డబ్బులు లెక్కించే క్రమంలో చంద్రకళ నుంచి రూ.29,500 నగదును దుండగులు నొక్కేశారు. ఇది గమనించని చంద్రకళన ఇంటికి వెళ్ళి నగదు లెక్కించి చూడగా, రూ.29,500 నగదు తక్కువగా వచ్చింది. తిరిగి బ్యాంకు వారి వద్దకు వెళ్ళి చంద్రకళ అడుగగా, బ్యాంకు వారు తాము సరైన నగదు ఇచ్చామని, దుండగులు చేతిలో నీవు మోసపోయావని చంద్రకళకు సమాధానమిచ్చారు. దీంతో చంద్రకళ ఏడుస్తూ వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 13న ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

# దడపుట్టిస్తున్న టిప్పర్లు

- భయాందోళనలో వాహనదారులు, పాదాచారులు
- ఏ క్షణం ప్రమాదం వస్తుందోనన్న పరిస్థితి
- నామ మాత్రపు చర్యలతో సరిపెట్టుకుంటున్న ఆర్టిఓ అధికారులు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా మాల్ నుండి కొద్ది రోజులుగా చెరువు మట్టిని తరలిస్తున్న టిప్పర్లు అతివేగంతో వెళ్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అతివేగంతో టిప్పర్లు నడుస్తుండటంలో వాహనదారులు, పాదాచారులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకోని ప్రయాణం సాగిస్తున్నారు. ఎటునుండి ఏ టిప్పర్ వస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒకేసారి 10 టిప్పర్ల వరకు వేగంగా వెళ్తుండటంతో రోడ్డుపై మట్టి పడి వెనక నుండే వచ్చేవారి కళ్లల్లో దుమ్మునిండి వాహనదారులు ప్రమాదాల భారీన పడుతున్నారు.టిప్పర్ల కారణంగా ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకోస్తుందోనని భయంతో కాలం గడపాల్సిన పరిస్థితి నెలకోంది. కాగా ఈ విషయంపై కొందరు ఆర్టిఏ అధికారికి ఫిర్యాదు చేసిన ఏదో నామమాత్రపు చర్యలు తీసుకోని వదిలేస్తున్నారు. అంతే కాకుండా ఫిర్యాదు చేసిన వారి వివరాలన్ని మట్టిని తరలించే యజమానికి పూర్తి సమాచారం ఇస్తున్నారు. ఒక్క ఆర్టిఓ అధికారులే కాదు ఇబ్రహీంపట్నం లోని అన్ని పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులు కూడ ఇదే తరహాలో నడుస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఫిర్యాదు దారుడు మాట్లాడిన ఫోన్ రికార్డింగ్ కూడ ఇస్తునట్లు పలువురు ఆర్టిఏ అధికారులపై ఆరోపిస్తున్నారు. ఈ నల్లమట్టి టిప్పర్లను మాజి ఎమ్మెల్యే అనుచరుడివి కావడంతో అధికారులు కూడ కళ్ళు మూసుకొని చూస్తున్నారని ఆరోపణలు లేకపోలేవు. కాగా ప్రమాదాలు జరగకముందే నివారించాలని ప్రజలు అధికారులను కొరుతున్నారు.

**నామమాత్రపు పెనాల్టిలు..**

మట్టి టిప్పర్లు అతివేగంగా వెళ్త ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని పలువురు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని తప్పని పరిస్థితుల్లో నామమాత్రపు చర్యలు, పెనాల్టిలు విదించి వదిలేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో మాడ్గుల మండలం ఇర్వేన్ చెరువు నుండి మట్టిన తరలిస్తూ నల్ల చెరువు సమీపంలో టిప్పర్ బోల్తాపడి ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందారు. ఆప్రమాదాన్ని ఎక్కడికి బయటికి పొక్కకుండా మేనేజ్ చేసుకున్నట్టు సమాచారం.గతంలో మాడ్గుల మండల నాయకులు అధికలోడ్‌తో అతివేగంగా వెళ్తున్నాయని దీంతో వాహన దారులకు, పాదాచారులకు ఇబ్బందులకు గురవుతు న్నారని టిప్పర్లను ఆపి ఆర్టిఓ అధికారులకు అప్పజెపితే అప్పుడు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు సంబంధించినవి కావడంతో నామ మాత్రపు పెనాల్టిలు వేసి వదిలేసారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు అదే తరహాలో మట్టి టిప్పర్లు నడుస్తున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మాజి ఎమ్మెల్యే అనుచరుడివి కావడంతో అధికారులు

**సైలెంట్..**

నల్లగోండ జిల్లా మాల్ నుండి కొద్ది రోజులుగా చెరువు మట్టిని తరలిస్తున్న టిప్పర్లు అతివేగంతో వెళ్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీనిపై అధికారులకు పలువురు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా చూసిచూడనట్టు వదిలేస్తున్నారు.కాగా ఈ మట్టి టిప్పర్లు మాజీ ఎమ్మెల్యే అనుచరుడివి కావడంతో ఆర్టిఓ, పోలీస్ అధికారులు సైలెంట్‌గా ఉంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఆర్టిఓ అధికారులు అదుపులోకి తీసుకున్న టిప్పర్లు

**మూడు టిప్పర్లపై కేసులు**

ఇబ్రహీంపట్నం పెద్దచెరువు కట్టపై మట్టి లోడుతో అతివేడంగా వెళ్తున్న మూడు టిప్పర్లను గురువారం ఆర్టిఓ అధికారులు సిజ్ చేసారు. వాటిపై కేసులు నమోదు చేసారు. టిప్పర్లను ఆర్టిఓ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. అధికలోడ్‌తో అతివేగంగా ఎవరైన ప్రయాణిస్తే వారిపై చట్టపరమైన చర్యలకు బాద్యులవుతారని ఆర్టిఓ అధికారులు హెచ్చరించారు.

# ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అక్రమాలపై సీఎంఓకు ఫిర్యాదు

### -ప్రత్యేక ఆడిట్, తనిఖీలు చేయాలని సీడిఎంఏకు వినతి
### -అధికారులు, బిల్‌కలెక్టర్లపై మాజీ సర్పంచ్ ఫిర్యాదు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పురపాలక సంఘంలో జరిగిన అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ కమీషనర్-డైరక్టర్ (సీడీఎంఏ) డి.దివ్య లకు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో బిల్‌కలెక్టర్లు ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల డబ్బులను సొంతానికి వాడుకుంటూ వ్యాపారాలు చేస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. కోట్ల రుపాయల డబ్బులు పక్కదారి పడుతున్నా ఉన్నత స్థాయి అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నోటీసులు ఇస్తూ కంటితుడుపు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను కమీషనర్ల నిర్లక్ష్యంతో బిల్‌కలెక్టర్లు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దెబ్బతీశారని తెలిపారు. మున్సిపల్ పరిపాలన, పన్నుల వసూలు డబ్బులపై సక్రమంగా విధులు నిర్వహించని ప్రస్తుత కమీషనర్‌ను బదిలీ చేయాలని కోరారు. గతంలో అధికారులపై ఫిర్యాదు చేయగా క్రిందిస్థాయి సిబ్బంది లంచాలు ముట్టజెప్పడంతో వారు ఏలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన మేనేజర్లు నిధులు దుర్వినియోగం చేయగా శాఖపరమైన చర్యలు తీసుకోలేదని, బిల్‌కలెక్టర్లు అక్రమ సంపాదనతో వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు చేపట్టక పోవడంతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలపై ప్రత్యేక ఆడిట్, తనిఖీలు చేయాలని మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ సీడీఎంఏ దివ్యకు విజ్ఞప్తి చేశారు.

## ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసుకున్న ఏయూ విద్యార్థులు

పోటో: 16 జిటికె 4 ఎన్‌సీసీ శిక్షణను పూర్తి చేసుకున్న క్యాడెట్లతో సీటీఓ మల్లేశ

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంకు చెందిన 30 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు 3 సంవత్సరాల శిక్షణను పూర్తి చేశారు. ఈమేరకు సికింద్రాబాద్ బైసన్ మైదానంలో అధికారులు క్యాడెట్లకు ఎన్‌సీసీ సీ-సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షను నిర్వహించారు. ఈసీఓ గ్రూప్ కెప్టెన్ వర్గాగోఖలే, వింగ్ కమాండర్ డిఎస్ఎన్ మూర్తిలు ప్రాక్టికల్ పరిక్షలో పాల్గొనగా కాకినాడ ఎయిర్ ఎన్‌సీసీ యూనిట్‌తో కలిసి పరీక్షను పూర్తి చేశారు. ఈసందర్భంగా అనురాగ్ విశ్వవిద్యాలయంలోని ఎన్‌సీసీ క్యాడెట్లను సీటీఓ డాక్టర్ చెన్నకేశ్ మల్లేశ అభినందించారు. ఇంజనీరింగ్, పీజీ విద్యతో పాటు ఎన్‌సీసీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు రక్షణ రంగంలో ఉద్యోగాలు, ఇతర నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని ఆయన పేర్కొన్నారు.





తహసీల్దార్‌గా వెంకటనర్సింహ్మారెడ్డిని సన్మానించిన మాజీ ఉపసర్పంచు వైద్యనాథ్, పలువురు నాయకుల దృశ్యం

## ఎంసిపల్లి మండల తహసీల్దార్‌గా వెంకట నర్సింహ్మారెడ్డి బాధ్యతలు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

మూడుచింతలపల్లి మండల తహసీల్దార్‌గా వెంకట నర్సింహ్మారెడ్డి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన నూతన తహసీల్దార్‌గ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉప్పల్ తహసీల్దార్‌గా పనిచేసి మూడుచింతలపల్లి తహసీల్దార్‌గ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. మూడుచింతలపల్లి మండల తహసీల్దార్‌గ పనిచేసిన వాణిరెడ్డి ఉప్పల్ మండల తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఎంసిపల్లి మండల తహసీల్దార్‌గ బాధ్యతలు చేపట్టిన వెంకట నర్సిం హ్మారెడ్డిని లక్ష్మాపూర్ మాజీ ఉపసర్పంచు వైద్యనాథ్, మండల నాయకులు వీరేశంగుప్త, జి.భస్వారెడ్డిలు సన్మానించి స్వాగతించారు. అదే విధంగ మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది కూడ ఆయనను స్వాగతించి సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## యువత నైపుణ్యత కల్పించటమే సంస్థ ధ్యేయము.

### - శిక్షణ సంస్థ డైరెక్టర్ క్రిష్ణ

**కొందుర్గు, ఫిబ్రవరి 16, (ప్రభాతవార్త) :** చదువుకున్న యువతి యువకులకు వివిధ రకాల తయారీలో శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ధ్యేయమని ఆ సంస్థ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో మేనేజర్ ఎ.వెంకటేష్, ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యూనియన్ బ్యాంక్, స్వర్ణ భారత్ ట్రస్టు జీఎంఆర్ వరలక్ష్మి పౌండేషన్, మల్లారెడ్డి గ్రూపు ఆఫ్ ఇన్స్‌ట్యూషన్ వారి సౌజన్యంతో మహిళలకు మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీషన్, బ్యాగుల తయారీ, పచ్చళ్ల కారం పోడి తయారీ, ఆగర్ బత్తీలు, కొవ్వొత్తుల తయారీ, పురుషులకు పాడి పరిశ్రమ, వర్మికంపోస్టు తయారీ, పుట్టగొడుగుల పెంపకం, నాలుగు చక్రాల వాహనాల మెకానిజం, డ్రైవింగ్, ఎయిర్ కండిషన్, సీసీ కెమెరాల మెకానిజం నేర్పిస్తామని వివరించారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు ధరఖాస్తులు చేసుకోవాలని కోరారు. శిక్షణకు వచ్చే వారికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఖాతాదారులు కె.కృష్ణయ్యగౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమహదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు

### -అర్ధమండలం దీక్షలు స్వీకరించిన శివస్వాములు

**కొడంగల్,ఫిబ్రవరి 16ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలోని శ్రీమహదేవుని ఆలయంలో శుక్రవారం శివస్వాముల అద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం హస్నాబాద్ శివస్వాములు,పరిసర గ్రామాల భక్తులు శివనామస్మరణతో భక్తి శ్రద్దలతో భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.దేశముఖ్ కుటుంబ సభ్యులు రావులపల్లి మాజీ సర్పంచ్ శివస్వామి రమేష్‌రెడ్డి,శివస్వాములు గురుస్వామి గడ్డం చంద్రశేఖర్ సమక్షంలో శివలింగానికి పంచామృతాభిషేకం, శివాష్టకం,లింగాష్టకం,శివాష్టోత్తర శతనామావళితో ప్రతే ్యక పూజలు నిర్వహించారు.అనంతరం సా ్వమివారికి నైవేద్యం సమర్పిస్తు మంగళహరతులు అందిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.దివంగత పార్వతమ్మ దేశ్‌ముఖ్ జ్ఞాపకార్ధం కుటుంబ సభ్యులు శివస్వాములకు అన్నదాన(బిక్ష) కార్యక్రమాన్ని నిర్వహించారు.దేశముఖ్ కుటుంబ సభ్యులు నిజలింగప్ప దేశ్‌ముఖ్,సందీప్‌రెడ్డిలు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.అలాగే మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని శివాలయంలో శివస్వాములు 40 మంది అర్ధ మండల దీక్షలు స్వీకరించారు.ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తహశీల్దార్ రజినికి కాంగ్రెస్ నేతల సన్మానం




తహశీల్దార్ రజనిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన డిఎస్.రజనిని శు క్రవారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. తహశీల్ కార్యాలయంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం నాయబ్ తహశీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డిని కూడా నేతలు సన్మానించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి సగ్గు అనిత, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్లు చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, బొక్క సుధాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు కొంతం రాంరెడ్డి, బర్ల దేవేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు రహమాన్, శివప్రదీప్‌రెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, రాజారత్నం, ఫారూఖ్, లోకేశ్‌నాయక్, సత్తిరెడ్డి, నర్సింగ్‌రావు, సుధాకర్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, కృష్ణారెడ్డి, నాగభూషణం, సుధాకర్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు

### 4వ వార్షికోత్సవంలో చైర్మన్



**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సహకార సంఘం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తున్నామని సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం 4వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం చైర్మన్ రాంరెడ్డి కేక్ కట్ చేసి సభ్యులకు, సిబ్బందికి తినిపించారు. రైతులకు అందిస్తున్న వివిధ ఋణాల ద్వారా సొసైటీ లాభాలభాటలో పయనిస్తుందని ఆయన తెలిపారు. సొసైటీకి ఆదాయం సమకూర్చేందుకు పాలకవర్గం సమిష్టగా కృషి చేస్తుందన్నారు. రైతులకు పంట, బంగారు, వాహన, స్వల్పకాలిక, దీర్ఘకాలిక, ఋణాలు మంజూరు చేయడంతో పాటు పొదుపును ప్రోత్సహించేలా డిపాజిట్లు స్వీకరించి వడ్డీ కల్పిస్తున్నామని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో యూబిఐ మేనేజర్ వివేక్, సొసైటీ ఎండి కరుణాకర్, మేనేజర్ రత్న జయప్రకాష్, డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, జిల్లాల పోచిరెడ్డి, వంగూరి లక్ష్మమ్మ, కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఇటిక్యాల రామకృష్ణారెడ్డి, వడిత్య మహేందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.